సాక్షి సంగారెడ్డి

1

సోమవారం, 10, జూన్, 2024

అక్షర విద్యాధరి.. భక్తజన నాచగిరి



వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం ఆదివారం చిన్నారుల అక్షరస్వీకారాలతో అలరారింది. నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో భక్తజన సందడి నెలకొన్నది. వేసవి సెలవులు, వారాంతపు సెలవు కలిసిరావడంతో జంట నగరాలు, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆయా క్షేత్రాలకు తరలివచ్చారు.

మమ్మేలు మల్లన్న స్వామి



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, పట్నాలు, ఒడి బియ్యం, అర్చనలు, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు.



హాల్ టికెట్లను చెక్ చేస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు




సూచనలు ఇస్తున్న కలెక్టర్ క్రాంతి

గ్రూప్1 ప్రిలిమ్స్ ప్రశాంతం

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ ప్రశాంతంగా జరిగింది. 16 పరీక్ష కేంద్రాల్లో 9,672 మందికి గాను 7,530 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. 2,142 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ క్రాంతి తనిఖీ చేశారు. పటేల్‌గూడ ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో 816 మంది అభ్యర్థులకు 601 మంది పరీక్ష రాశారు. అలాగే రుద్రారం గీతం యూనివర్సిటీలోని రెండు సెంటర్లలో 1,680 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1315 మంది హాజరయ్యారు. ఈ రెండు చోట్ల 16మంది పరీక్షకు ఆలస్యంగా వచ్చారు.

సంగారెడ్డి టౌన్ / పటాన్‌చెరు టౌన్

సింగూరుకు మహర్దశ



సింగూరు ప్రాజెక్టు

ప్రాజెక్టు కోసం రూ.168.30 కోట్లు విడుదల

- సాగునీటి కాల్వలకు సిమెంట్ లైనింగ్
- కుడి, ఎడమల 200 కిలోమీటర్ల మేర వర్తింపు
- మంత్రి దామోదర కృషితో నెరవేరిన పదేళ్ల కల
- సంబురాల్లో ఆయకట్టు రైతులు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు మహర్దశ పట్టనుంది. సాగునీటి కాల్వల మరమ్మతు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.168.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కాల్వల సిమెంట్ లైనింగ్ చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే చివరి ఆయకట్టు వరకు సాగు నీరందుతుందని రైతులు సంబుర పడుతున్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో ఈ నిధులు విడుదలయ్యాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న నీటి పారుదల శాఖ ఎస్ఈ ప్రతిపాదనలు పంపగా జూన్ 7న నిధులు మంజూరు చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ పరిపాలన విభాగం జీఓ నంబర్ 150ను విడుదల చేసింది.

బహుళ ప్రయోజనాలు

జిల్లాలోని భారీ నీటి పారుదల ప్రాజెక్టు అయిన సింగూరు ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయి. దీని నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువలు 60 కిలోమీటర్లు, డైవర్షన్ కెనాల్‌లు, మరో 150 కిలోమీటర్ల మేర సాగునీటి కాల్వలున్నాయి. ఈ సాగునీటి కాల్వల ద్వారా 40 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. ఈ కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయడానికి నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులు వానాకాలం తర్వాత ప్రారంభమవుతాయని ఇంజనీరింగ్ విభాగం తెలిపింది. సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయితే పుల్‌కల్, చౌటకూర్, అందోల్, మునిపల్లి, సదాశివపేట మండలాలకు సాఫీగా సాగునీరు అందుతుంది. అంతేకాకుండా నీరు ఆవిరి తగ్గడం, ప్రవాహ వేగం పెరగడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

30 టీఎంసీల సామర్థ్యం

సింగూరు ప్రాజెక్టుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతోంది. 1988 నుంచి నీటిని నిల్వ చేస్తున్న ఈ ప్రాజెక్టు నుంచి తాగు, సాగునీరు అందుతోంది. అంతేకాకుండా విద్యుత్ ఉత్పత్తికి కూడా నీటిని వినియోగిస్తున్నారు. 30 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి స్థానికంగా సాగునీటి కాలువకు 4 టీఎంసీలు, జంట నగరాల తాగునీటికి 4 టీఎంసీలు, ఘనపూర్ ఆయకట్టుకు 4 టీఎంసీలు, పెద్దారెడ్డిపేట, బుసారెడ్డిపల్లి మిషన్ భగీరథ పథకాలకు 9 టీఎంసీలను సరఫరా చేస్తారు.

పోరాటాల ఫలితం

సింగూరు ప్రాజెక్టు ప్రారంభంలో జంట నగరాల తాగునీటి కోసమే నిర్మించారు. సాగునీరు కావాలని రైతులు పోరాటాలు చేయడమే కాకుండా జోగిపేటలో 104 రోజులు నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సింగూరు సాగునీటి కాల్వలు మంజూరు చేస్తు ఉత్తర్వులిచ్చారు. పదేళ్ల క్రితం కాల్వల నిర్మాణం పూర్తయి 40వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు.



సిమెంట్ లైనింగ్ చేసే కాలువ

నీటి వృథాకు చెక్

సింగూరు సాగునీటి కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపడితే నీటి వృథాను అరికట్టవచ్చు. ఇప్పుడున్న కాలువలు పదేళ్ల క్రితం తవ్వినవి. దీంతో అవి పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. అక్కడక్కడ మట్టి కోసుకుపోయాయి. దీంతో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉంటుంది. సిమెంట్ లైనింగ్ చేస్తే చివరి ఆయకట్టు వరకు నీరు సులభంగా చేరి చౌటకూర్, అందోల్ మండలాల రైతులకు మేలు జరుగుతుంది.

సాగునీటి ప్రవాహం పెరుగుతుంది



సింగూరు కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేస్తే నీటి ప్రవాహం పెరుగుతుంది. మరిన్ని ఎకరాలకు సాగు నీరు అందుతుంది. పిచ్చి మొక్కలు కూడా పెరగవు. ప్రతిఏటా కాల్వలకు మరమ్మతు చేయాల్సిన అవసరం ఉండదు.

– పి.లక్ష్మారెడ్డి, రైతు, పోచారం

రైతులకు నీటి కష్టం ఉండదు



సాగునీటి కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయడం వల్ల అందోల్, చౌటకూర్ మండలాల్లోని కాల్వల్లో సాగునీటి ప్రవాహ వేగం పెరుగుతుంది. దీంతో రైతులకు నీటి కష్టాలు తప్పుతాయి.

ఎం.దుర్గారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

చివరి ఆయకట్టుకూ నీరు



సింగూరు సాగునీటి కాలువలకు సిమెంట్ లైనింగ్ వేయడం వల్ల నీటి ఆవిరి తగ్గి ఎక్కువ ఎకరాలకు నీరు అందుతుంది. కాల్వల నుంచి చెరువుల్లోకి, చివరి ఆయకట్టుకు నీరు చేరుతుంది. సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది.

– ఆర్.రామచంద్రారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్

జహీరాబాద్

అభివృద్ధే లక్ష్యం

పరిశ్రమలు తెస్తా.. యువతకు ఉపాధి కల్పిస్తా

- సీఎం సహకారంతో ఫార్మా క్లస్టర్ ఏర్పాటు
- బోధన్– బీదర్ రైల్వేలైన్, నిజాంపేట్– బీదర్ రహదారి పూర్తి
- 'సాక్షి'తో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయించడమే కాకుండా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీగా విజయం సాధించిన సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పలు అంశాలను వెల్లడించారు.

నారాయణఖేడ్:

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జహీరాబాద్ ప్రాంతానికి నిమ్జ్ తీసుకువచ్చాం. మళ్లీ ఆ పనులను వేగవంతం చేయించి పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా. నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలు కూడా పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా చూస్తా. సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా 2వేల ఎకరాల భూములు సమకూరిస్తే నారాయణఖేడ్, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో ఫార్మా క్లస్టర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నియోజకవర్గాల పరిధిలో అవసరమయ్యే భూములను సేకరించేందుకు కృషి చేస్తా. కర్మాగారాలు ఏర్పాటు చేసి యువత, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా.

☛ ఎంపీగా మీ ప్రాధాన్యతాంశాలు?

మొదటి సారి ఎంపీగా గెలుపొందిన సందర్భంలో సంగారెడ్డి– అకోలా జాతీయ రహదారి కోసం ప్రతిపాదనలు చేసి ప్రభుత్వం ద్వారా జీఓ విడుదల చేయించాను. అదే సమయంలో నిజాంపేట్– నారాయణఖేడ్– బీదర్ జాతీయ రహదారి కూడా మంజూరు చేయించా. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తా. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తా. పరిశ్రమల ఏర్పాటుపై ప్రధాన దృష్టి సారిస్తా.

☛ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమేరకు అమలు చేస్తారు?

ఉత్తర తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఆదిలాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు తాను ఒక్కడినే విజయం సాధించాను. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులు కావడం వల్ల అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుని తనకు అవకాశం ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తాను. బోధన్– బీదర్ రైల్వేలైన్ తాను మొదటిసారి ఎంపీగా ఉండగా మంజూరు చేయించా. సర్వే కూడా పూర్తయ్యింది. రెండుమార్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఈ రైల్వేలైన్ కోసం పట్టించుకోలేదు. ఈ రైల్వేలైన్ ఏర్పాటుతో లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల్లో రవాణా పరంగా అభివృద్ధి సాధ్యపడుతుంది.

☛ ఎన్నికల్లో పోటీ తీవ్రత, క్రాస్ ఓటింగ్ గెలుపుపై అనుమానం వేయలేదా?

దేవుడి పేర రాజకీయాలు చేసినా ప్రజలు మాత్రం సెక్యూలరిజంకే పట్టం కట్టారు. తాను బీబీ పాటిల్‌తో పోటీ చేయలేదు. మోడీతోనే పోటీచేసి గెలుపొందాను. బీజేపీ రాముడి పేర రాజకీయం చేశారు. ఈ విధానం మంచిది కాదు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో బీ.బీ పాటిల్ చేరగా ఎన్నికల సమీపించే సమయానికి బీఆర్‌ఎస్ వారు క్రాస్ ఓటింగ్ చేయడంతో తమకు ఆశించిన స్థాయిలో మెజార్టీ రాలేదు. క్రాస్ ఓటింగ్ జరగకుండా భారీ మెజార్టీ లభించేది. అయినా 50వేల ఆధిక్యత వచ్చింది. జహీరాబాద్ నియోజకవర్గం ప్రజలు చైతన్యవంతులైనందున అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకొని రెండోమారు ఎంపీగా అవకాశం కల్పించారు. దేవుడి పేరుతో వైషమ్యాలు సృష్టించాలని చూసినా యువత అర్థం చేసుకొని సెక్యూలర్ విధానంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. బీజేపీ రాముడిపేర రాజకీయాలు చేసినా ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యాడు. అక్కడ ఇండియా కూటమి అభ్యర్థి గెలుపొందాడు. ఈ ఫలితం ద్వారా మోడీ నిజస్వరూపాన్ని ప్రజలు బయటపెట్టారు.

☛ పార్లమెంట్‌లో ప్రతిపక్షం కదా.. అభివృద్ధి ఎలా?

తాను మొదటిసారి ఎంపీగా ఎన్నికైన సమయంలో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేంద్రంపై ఎంపీగా ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్ర సాధనకు పాటుపడిన. సిద్ధాంతాలతో కూడుకున్న పార్టీ.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంది. అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తా. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా అన్ని అసెంబ్లీ నియోజవర్గాలు అభివృద్ధి సాధించేలా పాటుపడతా. మొదటిసారి ఎంపీగా ఖేడ్, ఎల్లారెడ్డిల్లో మోడల్ డిగ్రీ కళాశాలలు, జహీరాబాద్‌లో కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయించా. 15 మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయించా. అన్ని నియోజవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను కలుపుకుపోతూ అభివృద్ధికి పాటుపడతా.

న్యూస్‌రీల్

అభివృద్ధికి సహకారం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఆర్‌ఐ ఆనంద్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అనంతరం బీరంగూడలోని గోశాలను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాలి

సంగారెడ్డి టౌన్ : వర్గ పోరాటాల ద్వారా ప్రజాస్వామ్య మనుగడ సాధ్యమవుతుందని, అందుకు కమ్యూనిస్టులంతా కంకణబద్ధులు కావాలని సీపీఎం జి. జయరాజు పిలుపునిచ్చారు. రెండో రోజు ఆదివారం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో కొనసాగిన రాజకీయ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం కుల, మతాను రెచ్చగొడుతూ గొడవలు సృష్టిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

తొలి పంట పండింది

- జిల్లాలో జోరుగా ఆయిల్ పామ్ సాగు.. ఆనందంలో అన్నదాత
- మొదటి క్రాప్ కటింగ్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): జిల్లాలో ఆయిల్ పామ్ తొలి పంట పండింది. మొదటి పంట చేతికొచ్చిన వేళ రైతులు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. కొత్తల్లో పంటపై అనేక అనుమానాలు ఉన్నా.. అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇచ్చిన భరోసాతో రైతులు పంటను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2021లో మొదటి విడతగా 2,700 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేశారు. సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వడంతో పాటు ప్రతియేటా పెద్ద ఎత్తున మొక్కలను అందజేస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 11,268 ఎకరాల్లో పంట సాగు చేశారు. అంతర పంటగా మొక్కజొన్న, పత్తి, పొద్దుతిరుగుడు, అపరాల పంటలు సాగు చేయడంతో మంచి లాభాలు గడించారు. ఈనేపథ్యంలో మూడు సంవత్సరాల కిందట సాగు చేసిన మొక్క పది నెలల్లోనే ఏపుగా పెరిగి ప్రతి చెట్టుకు 18 నుంచి 20 గెలలు వచ్చాయి. ఎకరం పొలంలో నాటిన చెట్లకు సంవత్సరానికి 15 వందల టన్నుల దిగుబడి వస్తుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దసరా నాటికి మొదటి విడుతలో సాగు చేసిన పంట పూర్తిగా చేతికి వస్తుందని, జిల్లా వ్యాప్తంగా 40 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ అధికారులు తెలిపారు.



అక్కెనపల్లిలో రైతు పొలంలో ఏపుగా పెరిగిన మొదటి పంట

అధిక ఆదాయం

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు మొక్కలు నాటిన తరువాత అంతర పంటలను సాగు చేయడంతో అధిక లాభాలు గడించ వచ్చు. మూడేళ్ల కిందట వేసిన పంట ఆశించిన స్థాయిలో గింజ రావడం సంతోషంగా ఉంది. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులు కార్యాలయంలో సంప్రదించాలి. –శంకర్, ఆయిల్‌ఫెడ్ అధికారి

ఏడు ఎకరాల్లో సాగు

ఆయిల్‌పామ్ సాగుతో మంచి లాభాలు వస్తాయని అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పడంతో మూడేళ్ల కిందట ఏడు ఎకరాల్లో పంట సాగు చేశాను. అంతర పంటగా మొక్కజొన్న, పత్తి సాగు చేయడంతో మంచి లాభాలు వచ్చాయి. పంట కోత దశకు రావడం ఆనందంగా ఉంది. మంచి పంటను సాగు చేసేలా ప్రోత్సహించిన హరీశ్‌రావు చేతుల మీదుగా మొదటి కోత ప్రారంభించడం సంతోషంగా ఉంది.

– తిప్పని నాగేంద్ర, రైతు అక్కెనపల్లి

సిద్దిపేట హబ్‌గా మారుతుంది

మనదేశానికి సరిపడా నూనె ఉత్పత్తి కాకపోవడం.. 60 శాతం విదేశాల నుంచి దిగుమతి చేయడంతో విదేశీ మారకం నష్టపోతున్నాం. 11,268 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌సాగు చేయడం ద్వారా సిద్దిపేటప్రాంతం ఆదర్శంగా నిలిచింది. ఈప్రాంతం ఆయిల్‌పామ్ హబ్‌గా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు మెయింటెనెన్స్ డబ్బులు, మొక్కలు, డ్రిప్పులు అందజేసి ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సహించాలి. – ఎమ్మెల్యే హరీష్‌రావు



మూడు నర్సరీల ఏర్పాటు

చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్, జగదేవ్‌పూర్ మండల ఎల్లాయిగూడ, ములుగు నర్సరీలో కలిపి 13 వేల ఎకరాలకు సరిపడా ఆయిల్‌పామ్ మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 8 వేల ఎకరాల్లో మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కోతలు ప్రారంభం కావడంతో ఆదివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు క్రాప్ కటింగ్ చేసి కోతలను ప్రారంభించారు. సేకరించిన గింజలను ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు తరలిస్తామని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెప్పారు.

● ఆటా సభలకు కార్పొరేషన్ చైర్మన్



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆటా మహాసభల్లో పాల్గొన్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: అమెరికా తెలుగు సంఘం(ఆటా) మహాసభలో పాల్గొనేందుకు తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి యూఎస్‌కు వెళ్లారు. అట్లాంటాలోని జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్‌లో జరుగుతున్న 18వ మహాసభలకు తెలుగు అసోసియేషన్ అధ్యక్షురాలు మధు బొమ్మనేని గిరిధర్‌కు ఆహ్వానం పంపారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డితో కలిసి అమెరికా వెళ్లారు. అక్కడ మంత్రి కోమటిరెడ్డితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

జైన చౌముఖి శిల్పం లభ్యం



బైరాన్‌పల్లిలో లభ్యమైన జైన చౌముఖి శిల్పం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లిలో వర్ధమాన తీర్థంకుడు ఉన్న జైన చౌముఖి శిల్పం లభ్యమైంది. గ్రామంలో అంగడి వీరన్న ఆలయం సమీపంలో విగ్రహం ఆనవాళ్లు కనిపించడంతో తవ్వి వెలికితీశారు. 10వ శతాబ్దానికి చెందిన చాళుక్యుల కాలం నాటి సర్వతోభద్ర విగ్రహంగా చరిత్రకారులు గుర్తించారు. ఈ తరహా విగ్రహాలు బైరాన్‌పల్లితో పాటు ఆకునూరు తదితర సమీప గ్రామాల్లోనూ లభ్యమైనట్లు గుర్తు చేశారు.

కరెంట్ షాక్‌తో మూడు ఆవులు మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కరెంట్ షాక్‌తో మూడు ఆవులు మృతిచెందాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మద్దికుంట శివారులో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కాశీరాం నాయక్ తన ఆవులను మేపేందుకు గ్రామ శివారులోకి తోలాడు. కురిసిన వర్షానికి కరెంట్ పోల్‌కు ఉన్న వైర్లు తెగి పడి ఉన్నాయి. మేస్తూ అటుగా వెళ్లిన జీవాలకు తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రమాదంపై విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపాడు.

రెండు తలల లేగదూడ మృత్యువాత



రుద్రారంలో రెండు తలల లేగదూడ కళేబరం

చిన్నశంకరంపేట(మెదక్): రెండు తలల లేగదూడ జన్మించిన కొద్ది సేపటికి మృత్యువాత పడింది. ఈ ఘటన మండలంలోని రుద్రారంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పులగల్ల నర్సయ్యకు చెందిన ఆవు రెండు తలల లేగ దూడకు జన్మనిచ్చింది. అరగంట తరువాత దూడ మృతిచెందింది. వెటర్నరీ అసిస్టెంట్ ప్రవీణ్, గోపాల మిత్ర మహేశ్ ఆవుకు అవసరమైన వైద్యం అందించారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ గీతామాలిక మాట్లాడుతూ జన్యుపరమైన లోపంతో రెండు తలలతో లేగదూడ పుట్టిందన్నారు. కవలలుగా పిండాలు అభివృద్ధి చెందాల్సి ఉండగా ఒకే శరీరంతో రెండు తలలు వృద్ధి చెందాయన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడికి సన్మానం



ఖర్గేను కలిసిన ఎంపీ షెట్కార్, ఆయన వెంటశివకుమార్

నారాయణఖేడ్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిశారు. ఎంపీగా గెలిచిన తర్వాత తొలిసారిగా ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి షెట్కార్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మొదటి జాబితాలోనే తన పేరును ప్రకటించారన్నారు. అందరి ఆశీస్సులు, సహకారంతో విజయం సాధించానన్నారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకా గాంధీ ఫోన్ చేసి అభినందించారన్నారు. ఈ సందర్భంగా ఆమెకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి అక్రమ రవాణా



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో జోరుగా మట్టి అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఆదివారం వస్తే చాలు యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. సెలవు దినాలు ఆసరాగా చేసుకుని మట్టి వ్యాపారులు రెచ్చిపోతున్నారని, అధికారులు స్పందించి క్రమ మట్టి వ్యాపారాన్ని అడ్డుకోవాలని కోరుతున్నారు.

సర్కారు బడి.. సౌకర్యాల ఒడి

యూనిఫాం, పుస్తకాలు ఉచితం

- సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన
- ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలు, ఫలితాలు
- చేరేందుకు విద్యార్థుల ఆసక్తి



కిష్టాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

తూప్రాన్: జూన్ ఆరంభం నుంచి చిన్నారులను స్కూళ్లలో వేయడానికి హడావిడి ప్రారంభమైంది. విద్యార్థులను ఆకట్టుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రచారాలు హోరెత్తిస్తున్నాయి. ఆధునిక విద్య అంటూ భారీగా ఫీజులు వసూలు చేయడానికి రెడీ అయిపోతున్నాయి. దీనికి సామాన్యులు సైతం ఆకర్షితులవుతున్నారు. కానీ కార్పొరేట్ వైపు అడుగులు వేయడం మంచిది కాదని పలువురు విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు విద్యార్థులకు అనేక వసతులతో స్వాగతం పలుకుతున్నాయి. బడిబాట పేరుతో గ్రామాల్లో, పట్టణాల్లో ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఆశపడుతున్న ఇంగ్లిష్ మాధ్యమ విద్యాబోధన కూడా అమలవుతోంది. ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తుంది. అలాగే మధ్యాహ్న భోజన పథకం, ఉపకార వేతనాలు కూడా. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారు.

ఉచిత పుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో పదో తరగతి విద్యార్థికి సుమారు రూ.700 విలువైన బుక్స్ అందజేస్తున్నారు. గత సంవత్సరం నుంచి 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు వర్క్‌బుక్‌లు సైతం అందజేస్తున్నారు.

నాణ్యమైన బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థులైన సుశిక్షితులైన బోధనా సిబ్బంది మాత్రమే పాఠాలు బోధిస్తారు. మారుతున్న బోధన, అభ్యాసన విధానాలకనుగుణంగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. అన్ని తరగతుల వారికి ఇంగ్లిష్ బోధన అందిస్తున్నారు.

బాలికలకు ప్రత్యేకం

సమగ్ర శిక్ష అభియాన్ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినుల్లో జీవన నైపుణ్యాలు మెరుగు పరిచేందుకు ప్రావీణ్యానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

ప్రైవేట్ స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా పరికరాలు ఉండటంతో విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం సాధిస్తున్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది.

సౌకర్యాలివే

- పేద విద్యార్థులు కోసం ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. 1 నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.45లు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఒక్కొక్కరికీ రోజుకు రూ.8.17లు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ఏటా రెండు జతల యూనిఫారాలను అందిస్తుంది. దీంతో నిరుపేద పిల్లలు డ్రాపౌట్ కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తుంది. దీంతో ఆర్థికంగా వెనుకబడిన వారు చదువుకునేందుకు చేయూత లభిస్తుంది.
- పాఠశాల నుంచి విద్యార్థి ఇంటికి మూడు కిలోమీటర్ల దూరం ఉండి ఎలాంటి రవాణా సౌకర్యాలు లేనిపక్షంలో 6, 7, 8 వ తగరతుల వారికి రూ.250 చొప్పున ప్రభుత్వం రవాణా భత్యం చెల్లిస్తుంది.

అదనపు ప్రయోజనాలు

- ప్రభుత్వ వైద్యులతో ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ కృషి చేస్తుంది.
- ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం పొందేందుకు సర్కారు విద్యార్థులు మాత్రమే అర్హులు.
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచితం ప్రవేశం కల్పిస్తుంది.
- గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు అర్హత ఉంటుంది.

పరిశోధనలకు అవకాశం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశోధనల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. జాతీయ, సైన్స్ పరిశోధన అంశాలు ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ అవార్డుల పథకంలో పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఇస్తుంది. వైజ్ఞానికి ప్రదర్శనల్లో పాల్గొనేందుకు విద్యాశాఖ ప్రోత్సహిస్తుంది.



విద్యార్థులకు సన్నబియ్యం అన్నం వడ్డిస్తున్న ఆయాలు (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో రైతు.. కుటుంబ కలహాలతో మహిళ..

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కథనం మేరకు... మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన టప్ప మల్లేశం(38) పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గతేడాది కురిసిన వడగళ్ల వానతో పంట దెబ్బతిని నష్టపోయాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై అప్పుల భారం పెరిగింది. వాటిని ఎలా తీర్చాలో తెలియక లోలోన మనస్తాపం చెందుతున్నాడు. ఈక్రమంలో గత నెల 30న పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన భార్య యాదమ్మ స్థానికుల సహాయంతో వెంటనే మెదక్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున చనిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేగుంటలో..



మౌనిక మృతదేహం

చేగుంట(తూప్రాన్): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని చందాయిపేటలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అవబోతు నవీన్, మౌనిక(25)తో వివాహమైంది. కొడిపల్లి మండలం లింగుపల్లిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం చందాయిపేటకు ఇద్దరు వచ్చారు. శనివారం రాత్రి మౌనికతో అత్త శేఖవ్వ, మామ నాగులు గొడవ పడ్డారు. మరుసటి రోజైన ఆదివారం ధాన్యం డబ్బుల కోసం నవీన్ చేగుంటకు వెళ్లాడు. అత్తమామ బయటికి పోయారు. ఈ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మౌనిక ఉరి వేసుకొని మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎ బాలరాజు తెలిపారు.

కనులపండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



వెంకటాపూర్ గ్రామంలో కొలువైన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్టులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రసాద్‌రావు దంపతులు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు స్వామివారికి మొక్కులు చెల్లించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. కొల్చారం(నర్సాపూర్)


రావి ఆకుపై మోదీ చిత్రం



నరేంద్ర మోదీ చిత్రాన్ని రావి ఆకుపై చిత్రీకరించారు మనోహరాబాద్ ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారి. ఆదివారం ప్రధానిగా మూడోసారి పదవీ బాధ్యతలు చేపడుతుండటంతో ఈ విధంగా తన అభిమానాన్ని చాటుకున్నారు. కాగా, ఆయనను పలువురు అభినందించారు. గతంలోనూ శ్రీరామనవమి సందర్భంగా రావిఆకుపై శ్రీరాముడి రూపాన్ని చిత్రీకరించడం తెలిసిందే.

మనోహరాబాద్(తూప్రాన్)

సాగుకు సమాయత్తం



బోర్ల కింద వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వరి, పత్తి పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. వర్షాలు కురిస్తే సాధారణం కంటే సాగు విస్తీర్ణం పెరగవచ్చని వ్యవసాయ శాఖ భావిస్తుంది. అందుకు తగినట్లుగా ఎరువులు, విత్తనాల సరఫరాలో నిమగ్నమైంది.

- 70 శాతానికి పైగా బోర్ల కింద వరి సాగు
- పత్తికి ప్రాధాన్యం

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం అంటేనే వరి సాగుకు పెట్టింది పేరు. పత్తి పంట రెండో స్థానంలో నిలుస్తుంది. ఇక్కడ వ్యవసాయం 70 శాతానికి పైగా బోర్లపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఎక్కువగా దొడ్డు రకం వరి సాగుకు ఇక్కడి రైతులు మొగ్గు చూపుతారు. ఇప్పటికే విత్తనాలను ఎరువులను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పంటల సాగు

వానాకాలం వరి సాధారణ సాగు విస్తీర్ణం 18,978. వర్షాలు అనుకూలిస్తే మరో 3 వేల ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరగనుంది. పత్తి విషయానికొస్తే సాధారణ సాగు 1,125 ఎకరాలకు కాగా అది కూడా 1,650కి పెరగవచ్చని వ్యవసాయ అధికారులు లెక్కలు వేస్తున్నారు. మిగతా 200 ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేయనున్నారు.

అవసరమైన ఎరువులు, విత్తనాలు

పూర్తిస్థాయిలో వానలు కురిసి భూగర్భ జలాలు పెరిగితే సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరగనుంది. ఇదే విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న వ్యవసాయ అధికారులు అందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అధికారుల అంచనాల ప్రకారం వరి విత్తనాలు 5,125 క్వింటాళ్లు, పత్తి 1,200 ప్యాకెట్ల అవసరం. ఇక ఎరువుల విషయానికి వస్తే యూరియా 1845, డీఏపీ 600, కాంప్లెక్స్ ఎరువులు 1450, సూపర్ ఫాస్ట్ 650, ఎంఒపీ 750 మెట్రిక్ టన్నులు అవసరం. ఇందులో సగానికి పైగా ఇప్పటికే రైతు ఆగ్రో సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా విక్రయాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అయితే పంట సాగుకు ముందు భూమికి బలాన్ని ఇచ్చే పచ్చి రొట్టె విత్తనాల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుంది. డిమాండ్ మేరకు అధికారులు ముందస్తుగానే ప్రతిపాదనలు పంపినప్పటికీ, వాటి సరఫరా పై స్థాయి నుంచి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇది కొంత రైతులకు ఇబ్బందికరంగా మారింది.

విత్తనాలు కొనే ముందు జాగ్రత్తలు అవసరం

విత్తనాలు కొనే ముందు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. దుకాణాలకు లైసెన్స్ ఉంది లేనిది తెలుసుకుంటే మంచిది. విత్తన బస్తాలు, ప్యాకెట్ల పైన ప్యాకింగ్ తేదీ ముద్రించి ఉండటం, ల్యాట్ నంబర్ తప్పనిసరిగా పరిశీలించాలి. కొనుగోలు చేసిన వెంటనే ధర, సంబంధిత వివరాలతో కూడిన రశీదును తప్పనిసరిగా అడిగి తీసుకోవాలి.

శ్వేత కుమారి ఏఓ, కొల్చారం

తిరుగు ప్రయాణంలో కబళించిన మృత్యువు

- బైకును ఢీ కొట్టిన కారు...
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: బైకును కారు ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... సంగారెడ్డికి చెందిన ఎండీ జహీరుద్దీన్(21) డెకరేషన్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో పటాన్‌చెరు మండలం రుద్రారంలో ఫంక్షన్ ఉంది. దీనికి హాజరయ్యేందుకు స్నేహితుడు, పూల వ్యాపారి అయిన ముసాయిబ్(19) బైక్‌పై జీషాన్(19), అతను ఎక్కారు. ఫంక్షన్‌కు వచ్చి తిరుగు పయనంలో జీషాన్ బైక్ నడుపుతుంటే వెనకాల కూర్చున్నారు. అప్పుడు సమయం తెల్లవారుజామున 3 అవుతుండగా.. లక్దారం గేట్ వద్ద యూటర్న్ తీసుకున్నారు. ఐటీడబ్ల్యూ సిగ్నోడ్ పరిశ్రమ దాటి ముందుకు వస్తుండగా సంగారెడ్డి వైపునకు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ కింద పడి పెట్రోల్ బయటకు వచ్చి మంటలు అంటుకొని జీషాన్‌కు కాలుకు గాయాలయ్యాయి. జహీరుద్దీన్ తలకు, ముసాయిబ్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జహీరుద్దీన్, ముసాయిబ్‌లను ఉస్మానియాకు తరలించారు. జీషాన్‌ను చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న జహీరుద్దీన్ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. జహీరుద్దీన్ సోదరుడు అఫ్రోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్



నాంపల్లి (ఫైల్)

ములుగు(గజ్వేల్): బైక్.. డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ములుగు శివారులో శనివారం అర్ధరాత్రి జరిగింది. ములుగు ఎస్‌ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం రామక్రిష్టాపూర్‌కు చెందిన భూషణమైన నాంపల్లి(32) మామిడి పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి 10 గంటలకు కరీంనగర్ నుంచి బైక్‌పై హైదరాబాద్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి బయలుదేరాడు. తెల్లవారుజాము 3 గంటలకు ములుగు శివారులో అతివేగంగా నడపడంతో అదుపు తప్పిన వాహనం డివైడర్‌కు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాంపల్లికి తల, చేతులు ఇతర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాసు పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

పటాన్‌చెరు టౌన్: ఆలయానికి వెళ్లి తిరిగొస్తుండగా స్కూటీని డీసీఎం ఢీ కొట్టిన ఘటనలో భర్త అక్కడికక్కడే మృతిచెందారు. భార్య, కూతురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన వరప్రసాద్(36) పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ ఫార్మా కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తన భార్య సుష్మ, ఏడాదిన్నర పాపతో కలిసి అతను రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానానికి స్కూటీపై వెళ్లారు. తిరిగొస్తుండగా లక్దారం సాయిబాబా దేవస్థానం సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని డీసీఎం ఢీ కొట్టింది. ఈ ఘటనలో వరప్రసాద్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, కూతురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డిపల్లి శివారులోనూ...

చేగుంట(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రెడ్డిపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంతంపల్లికి చెందిన పిట్ల కుమారస్వామి(28) పెద్దశివునూర్ బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తన సమీప బంధువులు మెదక్ జిల్లా శమ్నాపూర్‌కు చెందిన నిజ్జని నిర్మల, నర్సింహులును తన బైక్‌పై ఎక్కించుకొని వస్తున్నాడు. రెడ్డిపల్లి శివారులోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమారస్వామికి తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తునికాకు కోసం వెళ్లి ఒకరు.. స్నానానికి దిగి ఇద్దరు..



రాజేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతిచెందిన ఘటన హల్దీవాగు వద్ద చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు.. మేడ్చల్ జిల్లా కోనాయిపల్లికి చెందిన జక్కుల రాజేశ్(25) ఒక ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం వారి దగ్గరి బంధువు మృతిచెందాడు. దీంతో నిద్ర కోసం శనివారం సాయంత్రం బంధువులు సిద్దిపేట జిల్లా నాచారం గుట్టకు వచ్చారు. ఆదివారం ఉదయం మరోకరితో కలిసి రాజేశ్ బైక్ మీద ఇక్కడికి చేరుకున్నాడు. అనంతరం స్నానం చేసేందుకు అశోక్, శ్రీకాంత్, తదితరులతో కలిసి అతను హల్దీ వాగులోకి దిగాడు. స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పాపన్నపేట(మెదక్): స్నానానికి దిగిన ఓ భక్తుడు మంజీరా నదిలో మునిగి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కార్వాన్ ప్రాంతానికి చెందిన బండ మహేశ్(36) ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం దుర్గమ్మ దర్శనం కోసం తన స్నేహితులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం స్నానం చేసేందుకు మంజీరా పాయల్లోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఇది గమనించిన అతడి స్నేహితులు అక్కడ ఉన్నవారికి, పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లతో వెతికించగా మృతదేహం బయటపడింది. ఈ సంఘటనకు సంబంధించి లిఖిత పూర్వ ఫిర్యాదు అందలేదని ఎస్సై వివరించారు.



భాగమ్మ (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): మహిళ అదృశ్యమై.. అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించిన ఘటన చింతగున్న బండ అటవీ ప్రాంతంలో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మానెపల్లి, కొడిపల్లి మండలం కంచన్‌పల్లి శివారు మధ్యలో ఉన్న ఈ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం మేకల కాపరులు మహిళ శవాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఇక్కడికి చేరుకున్న వారు మానెపల్లిలో సుమారు 50 రోజుల క్రితం అదృశ్యమైన చాకలి భాగమ్మగా అనుమానించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహంపై ఉన్న దుస్తులను గుర్తించి భాగమ్మగా నిర్ధారించారు. అయితే మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉంది. ఎండవేడిమిని తట్టుకోలేక మృతిచెందిందా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. కుటుంబ పోషణ కోసం తునికాకు సేకరించడానికి అటవీ ప్రాంతానికి వెళ్లి శవంగా లభ్యం కావడంపై కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు.